క్లుప్తంగా

కుమ్మరికుంటలో గో కల్యాణం



గో కల్యాణంలో ప్రజాప్రతినిధులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోకల్యాణం నిర్వహించారు. ఆవు–నందికి వివాహం జరిపించారు. గోకల్యాణం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, ఎంపీటీసీ తమ్మనవేని మల్లేశం, ఉపసర్పంచ్ కొత్త మల్లేశం, ఆలయ చైర్మన్ శంకరయ్య పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న మోహన్

ధర్మారం: ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామశివారులోని దుర్గామాత ఆలయానికి అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్త మోహన్ రూ.50వేల విరాళం అందించారు. ఆలయ నిర్మాణ కర్త నూతి విజయలక్ష్మికి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తనవంతుగా ఆర్థికసాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ జిల్లా జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్, కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి ఎలిగేటి మహేందర్, పీఆర్‌వో బైరి చంద్రమౌళి, అమరపల్లి నారాయణ, కూరపాటి శ్రీనివాస్, గందం మల్లయ్య, అమలగాని రామకృష్ణ, కందుల మల్లేశం, గుండేటి రాజేశ్వరి, దామరపెల్లి సమత పాల్గొన్నారు.

సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



అన్నం పొట్లాలు అందిస్తున్న సురేశ్ భవాని

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రధాన చౌరస్తా పోచమ్మ దేవాలయంలో భవాని దీక్ష యజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నం ప్యాకెట్లు, అరటి పండ్లు అందజేశారు. ఈ సేవా సమితి నిర్వాహకుడు సురేశ్ భవాని, సభ్యులు గూడెపు రమేశ్, నల్ల రాంబాబు, నెలగంటి సదానందం, నరేశ్, సాయి, సతీశ్, వెంకటేశ్వర్లు, జి.తిరుపతి, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కంటైనర్‌పై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న గోపాలమిత్ర

ధర్మారం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పశుగణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మండలంలోని గోపాలమిత్ర కేంద్రం బంజేరుపల్లి, కొత్తూరు గ్రామాల్లో ఆదివారం ఎల్ఎన్2 కంటైనర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. గోపాలమిత్ర రాజేశం, కొత్తూరు సర్పంచ్ తాళ్ల మల్లేశం, సాయని కొమురయ్య, అంజయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ధర్మారం: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఈ స్తంభం మూలంగా వాహనదారులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు స్తంభాన్ని ఢీకొని గాయపడిన సంఘటనలున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సాగుపై అవగాహన కరువు

- జాడలేని రైతు చైతన్యయాత్రలు
- అటకెక్కిన మన తెలంగాణ మన వ్యవసాయం
- విత్తనాల ఎంపికలో సతమతం
- నష్టపోతున్న రైతన్నలు



ఎలిగేడు మండలంలో ట్రాక్టర్ ఫ్లవ్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఎలిగేడు: రోహిణి కార్తె ప్రారంభమైంది. వానాకాలం సాగుకు మండలంలోని 12 గ్రామాల రైతులు సన్నద్ధం అవుతున్నారు. విత్తనాల ఎంపిక, నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, ఏయే పంటలు సాగుచేయాలి అనే వాటిపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. దీంతో రైతులు వేసిన పంటలు అకాల వర్షాలు, చీడ పురుగుల బారినపడి నష్టపోవాల్సి వస్తోంది. పంట సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే రైతు చైతన్యయాత్రలు జాడ లేకుండా పోయాయి. మన తెలంగాణ–మన వ్యవసాయం అటకెక్కింది. ఏటా వానాకాలంలో సాగు, వ్యవసాయ రాయితీలు, సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ ప్రకటించకపోవడం గమనార్హం.

దృష్టిసారించని వ్యవసాయశాఖ..

రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడి, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు వ్యవసాయశాఖ చేపట్టాల్సి ఉంది. ప్రతి ఏటా వానాకాలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు చైతన్యయాత్ర, రైతు సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్నేళ్లుగా వీటిపై దృష్టి సారించడంలేదు. ఫలితంగా ఏ పంట వేయాలో.. ఏ పంట వేయద్దో తెలియని రైతులంతా మూస పద్ధతిలో మండలంలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలపై దృష్టిసారిస్తున్నారు. ఈ సాగు విధానంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెగులు బెడదతో పంటలు కాపాడుకునేందుకు ఖరీదైన మందులను పిచికారీ చేయాల్సిన పరిస్థితి వచ్చి ఆర్థికంగా దెబ్బతిన్నారు. ఏటా రైతు చైతన్యయాత్ర, మన తెలంగాణ–మన వ్యవసాయం కార్యక్రమాలను గ్రామగ్రామాన నిర్వహించి భూసార పరీక్షల ఆవశ్యకత, పంటల మార్పిడి, పంటల్లో చీడపీడల నివారణ, పంటలకు ఎరువులు ఏ మోతాదులో ఏ సమయాల్లో వాడాలో సేంద్రియ ఎరువుల వాడకంతో జరిగే లాభాలు, విత్తనోత్పత్తికి సంబంధించి తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మెలకువలు నేర్పాలి



పంటల సాగులో అధికారులు మెలకువలు నేర్పాలి. గతంలో నిర్వహించిన మాదిరిగానే రైతు చైతన్య యాత్రలు, మన తెలంగాణ–మనవ్యవసాయంపై సదస్సుల ద్వారా రైతులను చైతన్యపర్చాలి. పంటల్లో చీడపీడలు, తెగుళ్లు సోకి నష్టపోతున్నాం. వాటి నివారణ, పంటల సాగుపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలి.

– వేల్పూరి మాధవరావు, రైతు, శివుపల్లి

అవగాహన కల్పించాలి



పంట సాగు చేస్తున్న సమయంలో పంట మార్పిడిలో ఏ పంట సాగు చేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందో అవగాహన కల్పించాలి. విత్తనాల ఎంపికలో ఏవి నకిలీ విత్తనాలో, ఏవి స్వచ్ఛమైన విత్తనాలో తెలియక సతమతం అవుతున్నాం. పంటలు వేసే క్రమంలో రైతు వేదికల్లో అధికారులు రైతులకు విధిగా అవగాహన కల్పించాలి.

– భూసారపు శ్రీనివాస్ రైతు, ఎలిగేడు మండలం

సలహాలు ఇస్తున్నాం



మన తెలంగాణ–మన వ్యవసాయం కార్యక్రమం ప్రభుత్వం ఇప్పుడు నిర్వహిస్తలేదు. ప్రస్తుతం 5వేల ఎకరాల వరకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో రైతు వేదికలు నిర్మించాం. రైతు వేదికల్లో ఏఈవోల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం. పంటమార్పిడి విధానం మేలు.

– ఎం.ఉమాపతి, వ్యవసాయశాఖ అధికారి, ఎలిగేడు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



బడిబాటలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీవర్కర్లు



బడిబాటలో ఎంఈవో సంపత్‌రావు

రామగుండం: నూతన విద్యాసంవత్సరం ఆరంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు సంయుక్తంగా బడిబాట ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థులు ఉన్న ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు కోరారు. ఇదే ర్యాలీలో 3 నుంచి 6 ఏళ్ల వయసు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాదరవేణి స్వామి, అంగన్‌వాడీ వర్కర్లు పెంద్యాల విమల, శిరీష, జ్యోతి, స్రవంతి, పుష్ప, పంచాయతీ కార్యదర్శి శ్యాం పాల్గొన్నారు.

ఉచిత విద్య, మెరుగైన సౌకర్యాలు

జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఉచిత సౌకర్యాలు అందిస్తున్నట్లు రామగుండం మండల విద్యాధికారి సంపత్‌రావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని జెడ్పీహెచ్ఎస్ ఎన్టీపీసీ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల న్యూపీకే రామయ్య కాలనీ, పోరట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఆదివారం బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉచితంగా దుస్తులతో పాటు భోజనం, పుస్తకాలు, స్కాలర్‌షిప్, నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాంకుమార్, రజిత కుమారి, వసుంధర, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు నాణ్యమైన, గుణాత్మక విద్యాబోధన చేస్తున్నారని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా నాలాల ఆక్రమణ



కాట్నపల్లిలో చెరువు వరదనీటి కాలువ వద్ద ఆక్రమణకు గురైన స్థలం

- పట్టించుకోని అధికారులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామశివారులోని రాజీవ్ రహదారి పక్కనే వంద మీటర్ల దూరంలో ఊర చెరువు ఉండగా వరద నీటి ప్రవాహం కోసం ఏళ్ల కిందటనే రోడ్డు నిర్మాణంలో కల్వర్టులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అనుకొని ఉన్న భూయజమానులు నాలాలను లెక్క చేయకుండా స్థలాలను చదును చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నాలాలపై నిర్మాణాలు చేపట్టేందుకు స్థలాలను చదును చేస్తుండగా భవిష్యత్‌లో ప్రకృతి విపత్తుతో వరద నీటి ప్రవాహం వస్తే పరిస్థితి ఏంటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న భూములకు రేట్లు పెరగడంతో కొందరు స్థలాలను చదును చేసి నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. నూతన పంచాయతీ చట్ట ప్రకారం ఎవరైనా, ఏదైనా కాలువ, డ్రైనేజీ ప్రవాహాన్ని అడ్డుకోవడం, మళ్లించడం వంటి చర్యలు ఉల్లంఘించినా.. జరిమానా, చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా అమలు కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: రాష్ట్ర ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలు జూన్ 6, 7వ తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం పోస్టర్ విడుదల చేశారు. నాయకులు రాజరత్నం, ఎజ్జ రాజయ్య, జూల మోహన్, టి.రమేశ్‌కుమార్, రాంచందర్, రాజు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తున్నారు

పెద్దపల్లిరూరల్: 2017 నుంచి భరణం చెల్లిస్తున్న తనపై నిరాధారమైన ఆరోపణలు మోపుతూ రెవెన్యూ అధికారుల వద్దకు, ఆఖరికి కలెక్టర్‌కు తన తండ్రి కొండ్ల జనార్దన్ ఫిర్యాదు చేస్తున్నాడని రామగిరి మండలం కల్వచర్లకు చెందిన కొండ్ల సుభాష్ వాపోయాడు. గత ప్రజావాణిలోనూ కలెక్టర్ కార్యాలయం వద్ద తనపై నిరాధార ఆరోపణలు చేశాడని పేర్కొన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తనను తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వివరించారు.

సంక్షిప్త వార్తలు

✦5న విద్యుత్ విజయోత్సవాలు

గోదావరిఖనిటౌన్: రామగుండం నియోజకవర్గ పరిధిలో ఈ నెల 5న విద్యుత్ విజయోత్సవాలు జరపనున్నట్లు ఎన్పీడీసీఎల్ గోదావరిఖని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్, రామగుండం ఏడీఈ దాసరి రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్టీపీసీలోని సింధూర కాలేజ్ రోడ్‌లో గల లక్ష్మీనరసింహ గార్డెన్‌లో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

✦విద్యుత్ విజయోత్సవం విజయవంతం చేయాలి

ఎలిగేడు: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే విద్యుత్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఎలిగేడు మండల నుంచి ప్రజాప్రతినిధులు, విద్యుత్ వినియోగదారులు హాజరై విజయవంతం చేయాలని విద్యుత్ ఏఈ సంపత్‌రెడ్డి కోరారు.

✦సభకు తరలిరండి

సుల్తానాబాద్: విద్యుత్ దశాబ్ది విజయోత్సవ సభకు వినియోగదారులు అత్యధికంగా తరలివచ్చి జయప్రదం చేయాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్‌లో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. రథోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. పెద్దపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు ఎడెల్లి శంకర్, వెంకటేశ్, రాజు, శ్రీనివాస్, రవి, తిరుపతి పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఎలిగేడు: కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు సోమవారం ఎలిగేడు మండలం శివుపల్లిలో విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన ఎస్ఎంసీ చైర్మన్ రేణుక–పర్శరాములు, మండల మల్లేశం, ముతికల రాజయ్య, గాజుల శ్రీకాంత్, రేచవేని శ్రీనివాస్‌కు విజయరమణారావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఎంపీటీసీ మండల రమేశ్, నాయకులు కొమ్ము శ్రీనివాస్, అన్నమనేని మాధవరావు, అన్నమనేని కొండల్‌రావు, సాగర్‌రావు, ఆకుల ముకేశ్, ఆకుల నగేశ్, కల్లెపల్లి శంకర్, అనంతుల మొండయ్య పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



నరహరిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఓదెల: యువత రాజకీయాల్లోకి రావాలని మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి పిలుపునిచ్చారు. ఓదెలలో పద్మశాలీలు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు ఆయన సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను పద్మశాలీలు సన్మానించారు. అంతకుముందు పద్మశాలి కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి అయిల రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చీకట్ల మొండయ్య, బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం నేత్రదాత కుటుంబం

కోల్‌సిటీ: నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన సీనియర్ జర్నలిస్ట్ ఎలిగేటి శంకర్ కుటుంబం ఆదర్శనీయమని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, పలువురు కొనియాడారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన శంకర్ అనారోగ్యంతో గత నెల 24న మృతి చెందగా.. ఆయన నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ బ్యాంక్‌కు దానం చేశారు. నేత్రదాత నివాసంలో ఎలిగేటి శంకర్ సంస్మరణ సభను ఆదివారం సదాశయ ఫౌండేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు రాజమౌళి, వాసు, అన్నపూర్ణ, జ్యోతి, పలు సంస్థల ప్రతినిధులు రాజా, శ్రీనివాస్, దామోదర్, శ్రీలత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000–01లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: కరీంనగర్‌లో సోమవారం నిర్వహించే ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్ కోరారు. స్థానిక గంగానగర్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకుడు మడిపల్లి దశరథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కాజీపేట రాజయ్య, గద్దల అనిల్‌కుమార్, ఏలూరు రాంబాబు, ఆరెపెల్లి శ్రీనివాస్, ఇప్ప మహేశ్, సుద్దాల రమేశ్, చిలుక ప్రమోద్, వడ్లూరి లింగస్వామి, ఇప్ప శ్రీను, ముల్క ల శ్రావణ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కటకం సుదర్శన్‌కు నివాళి

జ్యోతినగర్: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు కటకం సుదర్శన్ (ఆనంద్) మరణంపై సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ కార్యదర్శి జూపాక శ్రీనివాస్ నివాళి అర్పించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక కుటుంబం నుంచి కార్మిక నాయకుడిగా ఎదిగి, భారత విప్లవోద్యమానికి అంకితమై చివరి శ్వాస దాకా పని చేశారని, ఆదివాసులు, పీడితులు, కార్మికులు, రైతుల కోసం ఎన్నో పోరాటాలు నిర్మించాడని గుర్తుం చేశారు. 1975 నుంచి తన విప్లవ జీవితంలో, దండకారణ్యంలో అజ్ఞాత వీరుడిగా నిలిచాడని కొనియాడారు. నమ్ముకొన్న రాజకీయాల కోసం చివరి దాకా నిలబడి, అమరత్వం పొందడం ఎంతో ఉన్నతమైన త్యాగమని, ఆదర్శవంతమైన విప్లవ జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి సుదర్శన్ అని అన్నారు. సీపీఐ (ఎం–ఎల్) ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ పక్షాన విప్లవ జోహార్లు తెలుపుతూ, ఆయన సహచరులకు, కుటుంబానికి సంతాప సానుభూతి తెలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.

శ్మశాన వాటిక పనులు పూర్తి చేయండి

సుల్తానాబాద్: పట్టణంలోని పుసాలలో ఉన్న శ్మశాన వాటిక పనులు పూర్తి కాకుండానే కాంట్రాక్టర్ వదిలి వెళ్లాడని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పురం రమణ ఆరోపించారు. దహన సంస్కారాలు చేసే క్రమంలో మహిళలు స్నానం చేసిన తర్వాత బట్టలు మార్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. శ్మశాన వాటిక పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.